

# సాక్షాత్కారం

రెడ్డీ, నేనూ బస్సు దిగటమేమి వీధులన్ని పరుగుపరుగున తిరిగాం. ఎదురుగుండా కన్పించే గాలిగోపురం "రా! రండి" అని పిలుస్తున్నట్టుంది. కృష్ణలో తల మునకలుగా స్నానాలు చేశాం. దేవుడి గుడి దర్శించాం. ధ్వజస్తంభం మీద రామచిలకని పలకరించాం. బజార్లో కొచ్చి పప్పుచెక్క కొనుక్కున్నాం. తింటూ ధరణికోట నడిచివెళ్ళి వూరు చుట్టూతా వున్న కోట దిబ్బ లెగబాకాం.

అప్పటికి మిట్ట మధ్యాహ్నమయింది.

అలిసిపోయాం. మొదట్నుంచీ చూస్తున్నాను. రెడ్డి పెద్ద స్థాణువులాంటివాడు. నా బలవంతాన బయలుదేరి అమరావతి వచ్చాడేతప్ప ఈమట్టిలో, ఈగాలిలో తిరుగుతుంటే అతనిలో ఏ స్పందనా లేదు.

"ఇక తిరిగిపోదామోయ్" అన్నాడు రెడ్డి.

"బౌద్ధశిల్పాలు చూడొద్దా!" అన్నాను.

'అమ్మ' అన్నట్టు నెత్తిన చేతులు పెట్టుకుని "తప్పేదేముంది పద" అన్నాడు.

దీపాల దిన్నెవైపు నడిచాం. పెద్ద దిబ్బ! స్థూపాకారంగా ఉన్న మట్టి పర్వతం. నాకేమో దానిపైన అనేక వందల వేల దీపాలు మినుకుమినుకుమని వెలుగుతున్నట్టు, వేల బౌద్ధ భిక్షువులు కాషాయాంబరాలతో బుద్ధుని గురించి

కీర్తిస్తున్నట్లు, ఆ పైన సామూహికంగా మౌన ప్రార్థనలు చేస్తున్నట్టు అనిపిస్తోంది. రెడ్డి గులకరాళ్ళు, ఎర్రమన్ను చేత్తో తీసికొని అటూ ఇటూ విసుర్తూ విసుగ్గా తిరుగుతున్నాడు.

"ఇక శిల్పాలు చూద్దాం పద ...... " అని తొందర పెట్టాడు. లేకపోతే అంత ఎండలో ఆ దీపాల దిన్నెమీద కూర్చుండిపోతానేమోనని అతని భయం ......

శిల్పాలు చూసి తిరిగొచ్చాం. "ఎలావుంది మ్యూజియం" అన్నాను.

"బొమ్మలు బాగానే చెక్కారు" అన్నాడు రెడ్డి పరమ సామాన్యంగా.

నాకు కడుపు చెరువయిపోయింది. గట్టిగా నెత్తిమీద కొడ్దామనుకున్నాను. ఎంత చెడ్డా స్నేహితుడు. 'రెడ్డీ! నువ్వు పెద్ద బండరాయివయ్యా, నిన్ను శిల్పంగా మలచగలవాడెవడో తెలియటం లేదయ్యా' అనుకుని లేవబోతుంటే మ్యూజియం క్యూరేటర్ వచ్చాడు. నేను గబగబా ఆయన దగ్గరకు పరుగెత్తుకెళ్ళి "అయ్యా స్థూపం కింద ఉన్న బుద్ధుడి అస్థికలు ఈ మధ్య దొరికాయటగా వాటిని చూపిస్తారా!" అనడిగాను.

క్యూరేటర్ ఒక్క క్షణం ఆలోచించి 'రండి'అన్నాడు.

నేను పరుగున వచ్చి మెట్లమీద కూర్చున్న రెడ్డిని లేపి, "బుద్ధుడి పవిత్రాస్థికలు చూపిస్తారట రా!" అన్నాను. రెడ్డి విసుక్కుంటూ లేచి వచ్చాడు. క్యూరేటర్ గదిలో మేం ముగ్గురం. పరమ నిశ్శబ్దంగా ఉంది. నాకు ఉద్వేగంతో చెమటలు పోస్తున్నాయి. 'ఏ అస్థికలపైన ఇంతటి మహాస్థూప నిర్మాణం జరిగిందో ఆ అస్థికల్ని దర్శించబోతున్నాను. కొన్ని శతాబ్దాలపాటు కొన్ని కోట్లాది ప్రజలు పూజించుకున్న తథాగతుని శరీరావశేషాలను చూడబోతున్నాను.'

క్యూరేటర్ లేచాడు. బీరువా తాళం తీసి తలుపులు తెరిచి సీలున్న కవరు తీసి అందులోంచి మరో తాళాలు తీశాడు. ఆ తాళాలతో ఇనప్పెట్టె తెరిచాడు. అందులోంచి మరో మంచిగంధం చెక్కతో చేసిన పెట్టె బైటికి తీశాడు. ఆ పెట్టె తీస్తున్నప్పుడు అతని ముఖం కళవళ పడుతోంది. దాన్ని దాచుకుందుకు కాబోలు "నేనీ పెట్టె తీస్తున్నప్పుడల్లా బుద్ధుణ్ని ప్రార్థిస్తాను. భగవాన్ మళ్ళీ క్షేమంగా ఈ ఇనప్పెట్టెలోకే వెళ్ళిపో! అని" అంటూ ఆ గంధపు చెక్క పెట్టెని టేబుల్‌మీదకి

తీసుకొచ్చాడు. టేబుల్‌మీద ఓ ముఖమల్ గుడ్డ పరిచాడు. ఆ గంధపు పెట్టె తెరిస్తే, అందులో ఐదు స్ఫటికంతో చేసిన భరిణెలు. ఆ భరిణెల్లో బుద్ధుడి అస్థికలు. ఒక్కొక్క భరిణే తెరిచాడు. ఒక భరిణెలో బుద్ధుడు ఎముక దానికి తోడుగా బంగారుపూలు, రత్నాలు. వాటిని శానంతో ఎత్తి చూపిస్తున్నాడు. రెండో భరిణెలో మళ్ళీ బుద్ధుడి ఎముక, చుట్టూ మంచి ముత్యాలు. మూడో భరిణెలో బుద్ధుడి ఎముక, బంగారు పూలు, నాలుగో భరిణెలో బుద్ధుడి ఎముక, పగడాలు - ఐదవభరిణెలో భిక్షాపాత్ర ముక్కలు, బంగారుపూలు.

భరిణెలు స్థూపాకృతిలో ఉన్నాయి.

నాకు ఒళ్ళు జలదరించింది.

"కోటి కోట్ల ప్రణతులందుకున్న భగవాన్ నువ్విక్కడున్నావా!"

"అయ్యా! నేను ఆ అస్థికల్ని ఒక్కసారి తాకవచ్చునా?" అనడిగాను.

క్యూరేటర్ తటపటాయించాడు. ఈ శానంతో ముట్టుకోండి అన్నాడు.

శానంతో ముట్టుకున్నాను.

నా వొళ్ళు జలదరించింది.

బుద్ధుడి పాదాలు తాకినట్లయింది.

బుద్ధుడి కళ్ళవెలుగులో కరిగిపోతున్నట్లనిపించింది.

బుద్ధుడు నా తలమీద ఆశీర్వదించినట్లనిపించింది.

కళ్ళంట నీళ్ళు! కరిగిపోతున్న గుండె!

క్యూరేటర్ నా చేతిలోంచి శానం తీసికొని పెట్టెమూసి భద్రంగా ఆ పెట్టెని ఇనప్పెట్టెలో దాచేశాడు,

కృతజ్ఞతల తర్వాత రెడ్డి, నేనూ తిరిగొస్తున్నాం. రెడ్డిలో ఏ చలనమూ లేదు. నేను మాట్లాడదలుచుకోలేదు.

ఉన్నట్టుండి రెడ్డే అడిగాడు. "ఆ ఎముకల విలువ ఎంతంటావ్?" అని. రెడ్డి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాను."ఆ పవిత్రాస్థికల విలువ సూర్య చంద్రులంత."

రెడ్డి కళ్ళు వెలిగాయి.*